
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

శనివారం 13 ఏప్రిల్ 2024 | 5



ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	35	28



కాలేజీ నుంచి వస్తూ...



కాలేజీ డ్రెస్‌లో...

విద్యా (వెంకట) లక్ష్మి

ఈ ఫొటోలో మీరు చూస్తున్నది అమ్మాయి కాదు... అమ్మ.. పేరు లంకే వెంకటలక్ష్మి. మత్స్యకార సామాజికవర్గానికి చెందిన మహిళ. ఊరు కాట్రేనికోన. చిన్న వయసులోనే శ్రీనివాసరావుతో వివాహమైంది. ఆయన సముద్రంలో చేపల వేట ద్వారా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు పిల్లలు. ఒకరు 8వ తరగతి, మరొకరు 6వ తరగతి చదువుతున్నారు. అయినా చదువుపై ఎంతో మక్కువ. దీంతో రెండేళ్ల క్రితం ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీలో చేరింది. పొద్దున్నే భర్తను వేటకు పంపించి పిల్లలిద్దరినీ స్కూలుకు పంపి 12 కిలోమీటర్ల దూరంలో వున్న ముమ్మిడివరం స్కూటీపై కాలేజీకి వెళ్లేది. తరగతులు పూర్తికాగానే క్షణం కూడా వృథా చేయకుండా ఇంటికి తిరిగి వెళ్లి పిల్లలిద్దరినీ చదివించేది. మొక్కవోని ధైర్యంతో తానూ చదువు కొనసాగించింది. శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో 814 మార్కులు సాధించి తనకు తానే సాటి అని నిరూపించింది. 28 ఏళ్ల వయసులో ఇంతటి ఘనత సాధించిన వెంకటలక్ష్మి మరెందరికో స్ఫూర్తి కావాలని ఆకాంక్షిస్తూ శ్రీకృష్ణదేవరాయ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ గణేశుల బ్రహ్మానందం, ప్రిన్సిపల్ గంధం శ్రీరామమూర్తి, జగతా సురేష్, అధ్యాపకులు అభినందించారు.

.... ముమ్మిడివరం



కొత్త జీడి గింజలు వచ్చేశాయ్

మలికిపురం, ఏప్రిల్ 12: చైత్ర మాసం రావడంతో కొత్త జీడి గింజలు మార్కెట్‌లోకి వచ్చాయి. ప్రతిఏటా మార్చిలోనే వచ్చే గింజలు ఈ ఏడాది కాపు ఆలస్యం కావడంతో ఉగాది తర్వాత అందుబాటులోకి వచ్చాయి. తొలుత క్వింటాలు ధర రూ.9వేలు పలకగా ఇప్పుడు ఇప్పుడు రూ.8వేలకు తగ్గింది. భవిష్యత్తులో కాపు పెరిగి అందుబాటులోకి వచ్చాక ధర మరింత తగ్గవచ్చని వ్యాపారస్తులు చెప్తున్నారు.

దిశా నిర్దేశం

- మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల గెలుపు బాధ్యత తీసుకోవాలని జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణకు సూచన
- కిమ్స్‌లో చంద్రబాబును కలిసిన ప్రముఖులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు రెండు రోజుల పర్యటన శుక్రవారం మధ్యాహ్నం ముగిసింది. అమలాపురం కిమ్స్ కళాశాలలో బస చేసిన బాబును శుక్రవారం ఉదయం నుంచీ జిల్లావ్యాప్తంగా తరలివచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. తొలుత మండపేట సిటింగ్ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మధ్య సయోధ్య కుదిర్చి వారికి దిశానిర్దేశం చేశారు. జోగేశ్వరరావును గెలిపించే బాధ్యతను భుజస్కంధాలపై వేసుకోవాలని లీలాకృష్ణకు సూచించడం ద్వారా నియోజకవర్గంలోని పరిస్థితులపై వారితో చర్చించారు. వైసీపీ ఓటమి లక్ష్యంగా, కూటమి విజయం ధ్యేయంగా పని చేయాలని సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పిస్తానని లీలాకృష్ణకు బాబు భరోసా ఇచ్చారు. ఆ తర్వాత పశ్చిమ గోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గంలో అభ్యర్థి మార్పుపై సిటింగ్ ఎమ్మెల్యే రామరాజు, ఆయన వర్గీయులతో చంద్రబాబు ప్రత్యేక భేటీ నిర్వహించారు. ఉండి అభ్యర్థిత్వంపై అందరితోనూ చర్చించి ఒకట్రెండు రోజుల్లో సముచిత నిర్ణయాన్ని ప్రకటిస్తానని బాబు హామీ ఇచ్చినప్పటికీ ఆ నియోజకవర్గం నుంచి వచ్చిన కేడర్‌లో అసంతృప్తి జ్వాలలు రగులుతూనే ఉన్నాయి. ఇక చిన్నచిన్న సమస్యల పరిష్కారం నిమిత్తం వివిధ నియోజకవర్గాల పార్టీ నేతలు బాబును మర్యాదపూర్వకంగా కలిసి తమ మనోభావాలను ఆయన ముందుంచారు. బాబుతో ఫొటోలు తీసుకునేందుకు పార్టీ నేతలు క్యూ కట్టారు. బస్సులోనే బసచేసిన బాబుతో కొందరు ఆంతరంగికంగా సమావేశమై ఎన్నికల పరిస్థితిపై నివేదికలు ఇచ్చినట్టు తెలిసింది. పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అంబాజీపేట, అమలాపురంలో జరిగిన ఉమ్మడి బహిరంగ సభలపై చంద్రబాబు ఆరా తీసినట్టు సమాచారం.

అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అమలాపురం అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, మహాసేన అధ్యక్షుడు సరిపెల్ల రాజేష్, నరసాపురానికి చెందిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు, కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, నామన రాంబాబు, నాయకులు మెట్ల రమణబాబు, అల్లాడ స్వామినాయుడు, పేరాబత్తుల రాజశేఖర్, పెచ్చెట్టి విజయలక్ష్మితో పాటు అనేక మంది నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చంద్రబాబు బసచేసిన ప్రాంతానికి చేరుకుని సందడి చేశారు. జనసేన నాయకులు ఆకుల బుజ్జి, లింగోలు పండు, కొప్పుల నాగమానసతో పాటు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి చంద్రబాబును కలిశారు. మధ్యాహ్నం 12 గంటలకు చంద్రబాబునాయుడు కోనసీమ పర్యటన ముగించుకుని కిమ్స్ హెలిపాడ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళ్లారు. ఆయనకు నాయకులు వీడ్కోలు పలికారు.



చంద్రబాబుతో మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల, జనసేన ఇన్‌చార్జి లీలాకృష్ణ





అమలాపురం కిమ్స్‌లో బస చేసిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబును కలిసేందుకు వచ్చిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు



ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల పారదర్శక నిర్వహణకు
ఏర్పాట్లు పూర్తి
కలెక్టర్ హిమాన్షు శుక్లా

ముమ్మిడివరం, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ప్రక్రియలు చేపడుతున్నట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అంశాన్నీ అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ర్యాండమైజేషన్ ద్వారా ఈవీఎంలను ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయిస్తూ వాటిపై స్టిక్కర్లు అతికించి ఆ వివరాలను స్కానింగ్ చేసి అప్‌లోడ్ చేస్తామన్నారు. ప్రస్తుతం కేటాయించిన ఈవీఎంలు, జాబితా, పోలింగ్ సిబ్బంది జాబితాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేస్తామన్నారు. ఆ ప్రకారం ఈవీఎంలను ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు. ర్యాండమైజేషన్ ప్రకారం ఎన్నికల సిబ్బంది తమకు కేటాయించిన అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు రిపోర్టు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్ మధుసూదన్, ఇంజనీరింగ్ విభాగం డీఈ సుబ్బరాజు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సహాయ కమిషనరు సత్యనారాయణ, స్థానాచార్యులు రంగాచార్యులు, ప్రధానార్చకులు కిరణ్

23 నుంచి లక్ష్మీనరసింహస్వామి
నక్షత్ర మాలధారణ

అంతర్వేది, ఏప్రిల్ 12: అంతర్వేదిలో కొలువైయున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 23, 24 తేదీల్లో స్వామివారి నక్షత్ర మాలధారణ దీక్ష చేపడుతున్నట్టు స్థానాచార్యులు రంగాచార్యులు, ప్రధానార్చకులు పాణింగపల్లి కిరణ్ తెలిపారు. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో లక్ష్మీనరసింహ స్వామిని ఇలవేల్పుగా భావించే భక్తులు ప్రతి సంవత్సరం అధిక సంఖ్యలో మాలధారణ చేస్తారు. 27 రోజులు దీక్ష స్వీకరించే భక్తులు 23వ తేదీ ఉదయం 5.30 గంటలకు జరిగే అభిషేకంలో, స్వాతి నక్షత్రం సందర్భంగా 24వ తేదీ ఉదయం ఏడు గంటలకు జరిగే అభిషేకంలో పాల్గొనాలని అర్చకస్వామి కోరారు. వైశాఖ శుద్ధ చతుర్దశి, శ్రీనృసింహ జయంతి అయిన మే 22వ తేదీ ఉదయం అభిషేకం అనంతరం నక్షత్ర మాల దీక్షా విరమణ, మహా శాంతి హోమం, పూర్ణాహుతి జరుగుతాయని ఆలయ సహాయ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు.

చంద్రబాబు సమక్షంలో పలువురు టీడీపీలో చేరిక

అమలాపురం రూరల్, ఏప్రిల్ 12: అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బస చేసిన టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో శుక్రవారం వివిధ గ్రామాలకు చెందినవైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు టీడీపీలో చేరారు. అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, అసెంబ్లీ అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన నాయకులకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. నల్లమిల్లి, బండారులంక సర్పంచ్‌లు గోకరకొండ వాసు, పెనుమాల సునీత, విలసవిల్లి ఎంపీటీసీ సలాది సురేఖ, కొమరగిరిపట్నంపీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గునిశెట్టి రోహిణీకుమార్, వివిధ గ్రామాలకు చెందిన వాసంశెట్టి సుభాష్ యువసేన, నాయకులు బొక్కా పార్థసారధి, దొమ్మేటి రాధ, కడలి వెంకటేశ్వరరావు, దంగేటి మీరాసాహెబ్, బొంతు శ్రీనివాస్, గుత్తుల సురేష్, కుప్పాల సత్తిబాబు, విప్పర్తి దుర్గావెంకటరమణ, వాసంశెట్టి రాధాకృష్ణ, కండిబోయిన సూర్య, కేతా కృష్ణ, దంగేటి బుజ్జి, గుత్తుల రాజా, కాట్రు ఆనందరావు, చేబ్రోలు చంద్రశేఖర్, వీరిన శేషుబాబు టీడీపీలో చేరారు. గతంలో టీడీపీ ప్రభుత్వం చేనేత కార్మికులకు, సహకార సంఘాలకు అమలుచేసిన పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని పునరుద్ధరించాలని బండారులంక, విలసవిల్లి గ్రామాలకు చెందిన చేనేత ప్రతినిధులు చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, గుంటు ఫణిప్రసాద్ ఆధ్వర్యంలోటీడీపీ అధినేత చంద్రబాబుకు వినతిపత్రం అందజేసి చేనేత వస్త్రాలతో సత్కరించారు. చేనేత వస్త్రాలపై సంఘాలకు 30శాతం రాయితీ, పావలా వడ్డీ, త్రిఫ్ట్ ఫండ్ పథకాలను పునరుద్ధరించాలని కోరారు. గతంలో మాదిరిగా నూలు, సిల్కుపై సబ్సిడీ కొనసాగించాలన్నారు. చేనేత కార్మికుల పరిస్థితులను గుర్తించి ఇల్లు, వర్కు షెడ్డు నిర్మించుకునేలా మూడు సెంట్ల స్థలాన్ని ఇళ్ల స్థల పట్టాగా అందించాలని, చేనేతలకు ఇంటికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తామని, నేతన్న నేస్తం పథకం కింద ఇస్తున్న రూ.24వేలు ప్రోత్సాహకాన్ని కొనసాగించేందుకు చంద్రబాబు అంగీకరించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాడా మాధవి, పుత్సల వరదరాజులు, వాసా భీమశంకరం, కాశిన బాబి, బట్టు పండు, మావూరి శివ, చింతపట్ల మోహన్, యినుమర్తి సతీష్, దాట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన బండారులంక సర్పంచ్ సునీత



టీడీపీలో చేరిన వ్యక్తికి పార్టీ కుండువా కప్పి ఆహ్వానిస్తున్న చంద్రబాబునాయుడు



చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యం
మహాసేన రాజేష్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 12: రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని మహాసేన రాజేష్ పిలుపునిచ్చారు. కిమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో బస చేసిన టీడీపీ అధినేత చంద్రబాబును శుక్రవారం ఆయన కలిశారు. ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యాచరణను చంద్రబాబు నుంచి తీసుకున్నట్టు తెలిపారు. పార్టీలో చేరి కొద్దికాలమే అయినప్పటికీ ఎంతో ప్రేమాభిమానాలు చూపించారని కొనియాడారు. తనకు పి.గన్నవరం అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వడానికి చంద్రబాబు కారణమైతే అది పోవడానికి ఎన్నో కారణాలు ఉన్నాయన్నారు. మార్ఫింగ్ వీడియోలను విడుదల చేయడంతో పాటు తనపై రకరకాల దుష్ప్రచారాలు చేయడంతో పార్టీకి, చంద్రబాబుకు చెడ్డ పేరు వస్తుందని ముందే గ్రహించి ఎమ్మెల్యే టిక్కెట్ వదులుకున్నానన్నారు. రాజేష్ వెంట గిడ్ల వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో అభిమానులు వున్నారు.

చంద్రబాబు దృష్టికి సర్పంచ్‌ల సమస్యలు

అంబాజీపేట, ఏప్రిల్ 12:

వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోయారని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సంఘాల నిధులను సీఎం జగన్ పక్కదారి పట్టించారని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి వివరించారు. శుక్రవారం ఆమె అమలాపురం కిమ్స్‌లో బస చేసిన చంద్రబాబును కలిసి వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని వివరించారు. విద్యుత్ బకాయిల పేరుతో ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పంచాయతీలకు సరఫరా నిలిపివేశారని తెలిపారు. పంచాయతీల పరిధిలో సేకరించిన చెత్తను డంపింగ్ చేసేందుకు స్థలాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి పంచాయతీలనూ చెత్త డంపింగ్‌కు స్థలాలు ఏర్పాటు చేయాలని శాంతకుమారి చంద్రబాబును కోరారు. సర్పంచ్‌లకు ఇచ్చే హామీలను మేనిఫెస్టోలో పెట్టాలన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అమలాపురం లోక్‌సభ కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, టీడీపీ నాయకులు నామన రాంబాబు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



చంద్రబాబును కలిసిన సర్పంచ్‌లు. చిత్రంలో టీడీపీ అమలాపురం లోక్‌సభ అభ్యర్థి హరీష్‌మాధుర్



సీతారాములు, కల్యాణానికి పందిరిరాట వేస్తున్న పండితులు అధికారులు

సీతారాములు, సత్యదేవుడి

దివ్య కల్యాణాలకు పందిరిరాట

అన్నవరం, ఏప్రిల్ 12: రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్యకల్యాణం, క్షేత్రపాలకుల సీతారాముల దివ్యకల్యాణోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం పందిరరాట శాస్త్రోక్తంగా వేశారు. చైత్రమాసంలో ఈనెల 16నుంచి 22వరకు కల్యాణోత్సవాలు జరుగనుండగా రాములోరి కల్యాణం 17న ఉదయం నిర్వహిస్తారు. సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల వార్షిక దివ్యకల్యాణోత్సవాలు మే 18 నుంచి ప్రారంభమై 24 వరకు జరుగుతాయి. సత్యదేవుడి దివ్యకల్యాణం మే 19 రాత్రికి వైభవంగా జరుగనుంది. ఈఏడాది రెండు కల్యాణాలకు ఒకేసారి పందిరిరాట ముహూర్తం రావడం విశేషం. కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఈవో రామచంద్రమోహన్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు

సామర్లకోటలో భక్తులకు

ఉచిత వసతి సదుపాయాలు



ఉచిత వసతి సదుపాయాలు భక్తులకు కల్పించే కల్యాణ మండపం

సామర్లకోట, ఏప్రిల్ 12: కాకినాడజిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం సమీపాన 200 మీటర్ల దూరంలో మాండవ్యనారాయణ స్వామి ఆలయం వద్దగల కల్యాణ మండపంలో ఉచిత వసతి సదుపా యాలు భక్తులకు పూర్తి అందుబాటులో ఉంచినట్లు ఆలయ కార్యనిర్వహ ణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు. ఈమేరకు శుక్రవారం విలేకరులతో ఈవో నీలకంఠం మాట్లాడుతూ ప్రతీరోజూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఈ సదుపాయాలు సుదూర ప్రాంతాల నుంచి భక్తుల అవసరార్థం ఏర్పాటుచేశామన్నారు. అలాగే భీమేశ్వరాలయం నూరుకాళ్ళ మండపంవద్ద దేవాలయ నిత్యాన్నదాన పథకంలో ఉచిత అన్నప్రసాద పథకం అమలులో ఉన్నందున భక్తులు ఈ అన్నప్రసాదాన్ని స్వీకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు.

పవన్ విజయాన్ని ఎవ్వరూ అడ్డుకోలేరు

● పిఠాపురంలో హైపర్ ఆది ప్రచారం

పిఠాపురం/కొత్తపల్లి, ఏప్రిల్ 12: పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ గెలుపుని ఎన్ని కుతంత్రాలు చేసినా ఎవ్వరూ అడ్డుకోలేరని ఆ పార్టీ స్టార్ క్యాంపయినర్, సినీ నటుడు హైపర్ ఆది తెలిపారు. పిఠాపురం పట్టణంలోని 2,3వ వార్డుల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఆయన శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓటు వేసి పవన్‌ను గెలిపించాలని అభ్యర్థించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవన్ లక్ష మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని చెప్పారు. పవన్‌కల్యాణ్ జనసేన పార్టీ పెట్టినప్పటి నుంచి సిద్ధాంతాలు నచ్చి ఆయనతో కలిసి అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఏ అధికారం లేకుండానే కౌలు రైతులు సహా ఎందరినో ఆదుకుంటున్నారని చెప్పారు. పవన్‌ను దత్తపుత్రుడు అంటూ కొందరు ఎగతాళి చేశారని, దత్తాత్రేయుడు ఆయన దత్తపుత్రుడిగా చేసుకుని పిఠాపురం నుంచి పోటీ చేయిస్తున్నారని తెలిపారు. అంతకు ముందు కోటగుమ్మం సెంటర్ వద్ద ఉన్న జైగణేష్ దేవస్థానం, అగ్రహారంలోని అనఘా దత్త క్షేత్రాల్లో పూజలు నిర్వహించారు. ప్రచారంలో జనసేన పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి వేములపాటి అజయ కుమార్, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ తనయుడు గిరీష్‌వర్మ, వీరమహిళల విభాగం ఉభయగోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే హైపర్ ఆది కొత్తపల్లి మండలం వాకతిప్ప, కొత్తపల్లి, కొండెవరం గ్రామాల్లో స్థానిక నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. జనసేన, టీడీపీ నాయకులు గవర రాంబాబు, మత్సా అప్పాజీ, గుండ్ర జగ్గారావు, గుండా అప్పారావు, పలువురు చేనేత కార్మికులు పాల్గొన్నారు.



పిఠాపురంలోని అనఘాదత్త క్షేత్రంలో పూజలు నిర్వహిస్తున్న సినీ నటుడు హైపర్ ఆది

వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలను

విజయవంతంగా నిర్వహించాలి

రెండో దఫా సమీక్షలో కొత్తపేట ఆర్డీవో సత్యనారాయణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 12: కోనసీమ తిరుమల వాడపల్లిలో ఈనెల 18 నుంచి 24వ తేదీ వరకు జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని కొత్తపేట ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన వివిధ శాఖల అధికారులతో రెండో దఫా సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. 19న తీర్థం, రథోత్సవం, కల్యాణోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, ఆర్టీసీ, హెడ్‌వర్క్స్, హెల్త్, అగ్నిమాపక శాఖల అధికారులు ఉత్సవాలకు తీసుకున్న చర్యలను వివరించారు. వివిధ డిపోల నుంచి 20బస్సులు నడుపుతున్నట్టు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్‌ఐలు, 60 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు సీఐ రామ్‌కుమార్ తెలిపారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్, డీఎల్డీవో రాజేశ్వరరావు, దేవదాయశాఖాధికారి మల్లేశ్వరరావు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, తహసీల్దారు వెంకట్రామయ్య పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదికను ఇన్‌చార్జి ఆర్డీసీ టి.విజయరాజు, ఆర్డీవో సత్యనారాయణ, అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించి ఏర్పాట్ల వివరాలు తెలుసుకున్నారు.



కల్యాణోత్సవాలపై సమీక్షిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

18న రావులపాలెంలో 'సిద్ధం' సభ

● సీఎం జగన్ హాజరు

రావులపాలెం, ఏప్రిల్ 12: రావులపాలెంలో ఈనెల 18న 'సిద్ధం' సభ నిర్వహించనున్నట్టు వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి, ఎంపీ సుభాష్ చంద్రబోస్, మంత్రి విశ్వరూప్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. అనంతరం 'సిద్ధం' సభ పోస్టర్లను విడుదల చేశారు. 18వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రావులపాలెంలో జరిగే సభకు సీఎం జగన్ హాజరవుతారన్నారు. రాత్రి కాకినాడ చేరుకుంటారన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ సతీష్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎంపీ చింతా అనురాధ, పలువురు నాయకులు పాల్గొన్నారు.



'సిద్ధం' సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఇంటర్ ఫలితాలలో 'తిరుమల' ప్రతిభ



అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్ ఫలితాల్లో రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్టు విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 470కి 466 మార్కులు 12 మంది విద్యార్థులు జె.శ్రీసాయి బృంద, బి.ఉమాశ్రీ, కె.హేమంత్, కె.ప్రజ్ఞ, సీహెచ్.పూజిత సాయి, ఎస్.కావ్యశ్రీ, జె.పద్మప్రియ, ఎం.దీపికా రాజకుమారి, ఎం.ఆయేషా సిద్ధిక్, ఎ.పద్మిని, కె.సాయి సృజన, బి.యశ్వంత్ లోవస్వామి సాధించారని, 464 పైన 191మంది, 460 పైన 732మంది, 450 పైన 1688 మంది సాధించి 98.85 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బైపీసీ విభాగంలో 440కి 436 మార్కులు నలుగురు విద్యార్థులు ఎల్.ప్రవల్లిక, ఆర్.సుచి, పి.సాయి అవినాష్, ఎ.దివ్యమానస సాధించారని, 433 పైన 62 మంది, 430పైన 120 మంది, 400 పైన 348 సాధించి 99.06 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను కె.బేబీ జాగృతి 990 మార్కులు, ఎం.దేవీవైష్ణవి 990 మార్కులు, 15 మంది విద్యార్థులు 989 మార్కులు, 11 మంది 985 మార్కులు పైన, 384 మంది 980 మార్కులు పైన, 1465 మంది 950 మార్కులు పైన సాధించి 99.88 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. బైపీసీ విభాగంలో 1000 మార్కులకుగాను ఎస్.రాధాకృష్ణ 989, ఎం.టిస్సా ఫ్రాన్సిస్ 989, డి.నవీన్ తేజా 989, పి.జ్ఞానశ్రీ 989 మార్కులు సాధించారని తెలిపారు. 58మంది విద్యార్థులు 980 పైన, 125 మంది 970 పైన, 227 మంది 850 పైన మార్కులు సాధించి 99.30శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. విద్యార్థులను శుక్రవారం పుష్పగుచ్ఛాలతో తిరుమలరావు అభినందించారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో 'ఆదిత్య' జయకేతనం

కాకినాడ రూరల్, ఏప్రిల్ 12: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి అత్యధిక శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీలో యోగిత, సవిత, అంజలి, సుజిత, ఆశిష్‌సాయి, బిందుమాధురి, అనిరుద్ 470 మార్కులకుగానూ ఏడుగురు విద్యార్థులు 465 మార్కులు సాధించి రాష్ట్రంలో అత్యుత్తమ స్థానాన్ని దక్కించుకున్నారన్నారు. అదేవిధంగా 20 మంది విద్యార్థులు 464 మంది సాధించారన్నారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో గీత సౌమ్య 1000 మార్కులకుగానూ 990, సైద్ షెహనాజ్ 989, ఐదుగురు విద్యార్థులు 988, ఎనిమిది మంది విద్యార్థులు 987 మార్కులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో 440 మార్కులకుగానూ వెంకట లలిత 435, ఒకరు 434, ముగ్గురు 433, మరో ముగ్గురు 432 మార్కులను పొందినట్లు తెలిపారు. ఎంఈసీ జూనియర్ ఇంటర్లో ఫలితాల్లో మహేశ్వరి, అంజనాదేవి, సంతోషి 500 మార్కులకుగానూ 489, సీనియర్ ఇంటర్ ఫలితాల్లో శేఖర్ సాత్విక 1000 మార్కులకుగానూ 978, సరయు 972 ఇద్దరు విద్యార్థులు 971 మార్కులు సాధించారన్నారు. ఈసందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆదిత్య ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి కృష్ణదీపక్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ సతీష్‌రెడ్డి, జూనియర్ కళాశాలల సమన్వయకర్త లక్ష్మీకుమార్ తదితరులు అభినందించారు.

'శ్రీ ప్రకాష్' విద్యార్థుల విజయభేరి



టి.వినీలా



డీడీ సాయి శ్రీనివాస్



లాస్యనందిని



సాయి నిహారిక



ఎస్‌ఐ మేఘన



జి.వర్షిణి

తునిరూరల్, ఏప్రిల్ 12: ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం నుంచి టి.వినీల 1000కి 982, డీడీ సాయి శ్రీనివాస్ 1000కి 980 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా బైసీపీ ద్వితీయ సంవత్సరం లో కె.లాస్యానందిని 1000కి 979 మార్కులతో అగ్రస్థానం, ఎంపీసీ ప్రథమం, డీవీఎల్ సాయి నిహారిక 470కి 464, ఎస్. మేఘన 470కి 463 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైసీపీ ప్రథమ సంవత్సరంలో జి.వర్షిణి 440కి 428మార్కులతో అగ్రస్థా నంలో నిలిచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

175 నియోజకవర్గాల్లోనూ బీఎస్పీ పోటీ

● బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 12: రాష్ట్రంలో బహుజనుల సమస్యలు రాజ్యాధికారం ద్వారానే పరిష్కారమవుతాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బక్కా పరంజ్యోతి అన్నారు. రాజమహేంద్రవరం గేదెల నూకరాజు కల్యాణ మండపంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులతో సమీక్షించారు. ఒక బీసీగాని, ఎస్సీ గాని ముఖ్యమంత్రి కావాలంటే అది బీఎస్పీ వల్లే సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని చెప్పారు. తొలుత పూలే, కాన్షీరాం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు, రాజమహేంద్రవరం, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థులు పి.గణేశ్వరరావు, కే.నరసింహమూర్తి, నిడదవోలు,పి.గన్నవరం, అమలాపురం, రాజమహేంద్ర వరం రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థులు గుమ్మాపు చిత్రసేను, కె.సత్యం, యాళ్ళ దొరబాబు, కొండపల్లి సూరిబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్రహ్మణ్యం, కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఎం మోషే తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

రుణాలు ఇప్పిస్తామని మోసం

● లక్షల్లో సొమ్ములు కోల్పోయామని బాధితుల ఫిర్యాదు

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 12: రుణాల పేరుతో మోసగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు బాధితులు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం కేసు నమోదు చేశారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన చిన్నం మణి, అన్నవరం, మంగం వసంత, లోడా పద్మ, బందిలి భవానీ, నాగలక్ష్మి, కుంచే సత్యవతి తదితరుల వద్దకు కాకినాడకు చెందిన పెదపాటి చిన్ని, జగ్గంపేటకు చెందిన పద్మలతో పాటు చేబ్రోలుకు చెందిన అన్నవరం అనే వ్యక్తి ద్వారా వచ్చి తక్కువ వడ్డీకి రుణాలు ఇప్పిస్తామని, రుణమాఫీ చేయిస్తామని నమ్మబలికారు. వీరి ఆధార్, రేషన్‌కార్డుల జిరాక్స్‌లు, ఫోటోలు తీసుకుని బ్యాంకు పత్రాలపై సంతకాలు తీసుకున్నారు. రుణాలు మంజూరయ్యాయని చెప్పి రూ.50వేలు వంతున ఇచ్చారు. రుణ వాయిదాలను చిన్నికి చెల్లిస్తూ వచ్చారు. కొంతకాలం తర్వాత పిఠాపురం బ్యాంకు ఆఫ్ బరోడా సిబ్బంది వచ్చి మీరు రూ.2లక్షల వంతున రుణం తీసుకున్నారని, వాయిదాలు చెల్లించలేదని చెప్పారు. తక్షణం రుణాలు చెల్లించాలని సూచించారు. దీంతో తాము మోసపోయినట్లు తెలుసుకుని చిన్ని ప్రశ్నించగా తమను బెదిరించిందని బాధితులు తెలిపారు. తమను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు జిల్లా ఎస్పీని ఆశ్రయించారు. విచారణ అనంతరం పోలీసులు ఎట్టకేలకు కేసు నమోదు చేశారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు

పిఠాపురం, ఏప్రిల్ 12: నిర్లక్ష్యంగా వాహనం నడిపి ముగ్గురు మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష, ఆరు వేల రూపాయలు జరిమానా విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.సుధారాణి తీర్పు చెప్పారు. పెదపూడికి చెందిన భక్తులు తలుపులమ్మలోవకు వెళ్లేందుకు ట్రాక్టర్‌పై బయలుదేరి పిఠాపురం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో గోపాల్‌బాబా ఆశ్రమం సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వేగంగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో బాలుడు సహా ముగ్గురు మరణించారు. దీనిపై అప్పటి సీఐ రాంబాబు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ తిమ్మాపురం గ్రామానికి చెందిన సలాది సత్తిబాబుకు వివిధ సెక్షన్ల కింద జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు చెప్పారు. ఏపీపీ ఆకుల నాగలీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

పెద్దిపాలెంలో తాటాకిల్లు దగ్ధం

● రూ.20లక్షలు ఆస్తినష్టం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 12: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని పెద్దిపాలెం గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో 3 పోర్షన్‌ల తాటాకిళ్లు దగ్ధమై రూ.20లక్షల ఆస్తినష్టం కలిగింది. దీంతో మూడు కుటుంబాల వారు నిరాశ్రయులయ్యారు. పెద్దిపాలెంకు చెందిన పక్కుర్తి అచ్చిరాజు, లోవరాజు, పక్కుర్తి మాణిక్యం కుటుంబాలకు చెందిన మూడుపోర్షన్‌ల తాటాకిళ్లు శుక్రవారం తెల్లవారుజామున 2గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదు, 30బస్తాల ధాన్యం, 10కాసుల బంగారం కాలి బూడిదయ్యాయి. విలువైన ఫర్నీచర్ మంటలకు ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో 3 కుటుంబాల వారు సర్వం కోల్పోయి వీధిన పడ్డారు. ప్రమాద విషయం తెలిసి ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుని అడిగి తెలుసుకుని బాధితులను ఓదార్చి బియ్యం, నగదు అందజేశారు. పెద్దిపాలెంకు చెందిన కొందరు రూ.11వేలు బాధిత కుటుంబానికి సహాయం అందజేశారు.



పెద్దిపాలెంలో దగ్ధం అవుతున్న తాటాకిళ్లు



బీరువాలో కాలిపోయిన సామాన్లను పరిశీలిస్తున్న సత్యప్రభ

సామర్లకోటలో వాహన తనిఖీల్లో

రూ.12.67 లక్షలు స్వాధీనం



సామర్లకోటలో వాహనాల తనిఖీలో పట్టుబడ్డ డబ్బు

సామర్లకోట, ఏప్రిల్ 12: ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు సామర్లకోట పట్టణంలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు శుక్రవారం స్థానిక మఠం సెంటర్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఎటువంటి ధ్రువ పత్రాలు, రసీదులు లేకపోవడంతో ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.12 లక్షల 67వేల 611లను స్వాధీనం చేసుకున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జాస్తి రామారావు తదితర పోలీసు అధికారులతో కలసి ఈ తనిఖీలు నిర్వహించా రు. పెద బ్రహ్మదేవం గ్రామానికి చెందిన సీహెచ్‌వీవీ సత్యనారాయణమూర్తి వద్ద రూ.5.39లక్షలు, అచ్చంపేటకు చెందిన ఎల్లా రాకేష్ వద్ద రూ.7లక్షల, 28 వేల 611లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాలను సీజ్ చేసి ట్రెజరీకి అప్పగించినట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామారావు చెప్పారు.

లాడ్జిలో ఉరి వేసుకుని యువకుడి మృతి

రామచంద్రపురం(ద్రాక్షారామం), ఏప్రిల్ 12: రామచంద్రపురంలో సాయి దత్తా లాడ్జిలో పెమ్మనబోయిన అనిల్ కుమార్(25) ఉరి వేసుకుని మృతి చెందాడు. వేళంగి గ్రామానికి చెందిన అనిల్ గురువారం సాయంత్రం స్థానిక సాయిదత్తా లాడ్జిలో రూమ్ తీసుకున్నాడు. రూమ్‌లో అనిల్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లాడ్జి మేనేజరు మేకా శివప్రసాద్ బంధువులకు సమాచారం ఇచ్చారు. అనిల్ అన్న వీరబాబు ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ కె.సురేష్‌బాబు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అనిల్‌కు తండ్రి లేడు, తల్లి వద్ద ఉంటున్నాడు. క్రికెట్ బెట్టింగ్స్‌కు బానిసై ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు.



మృతి చెందిన అనిల్‌కుమార్

నీడనై నీవెంటే..

● ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల జోరు ● ఎన్నికల అధికారులపై కూడా నిఘా

● ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలకు సీసీ కెమెరాలు

● కలెక్టర్, రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు అనుసంధానం

సామర్లకోట, ఏప్రిల్ 12: వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వారి ప్రచారాలు, డబ్బు, మద్యం సరఫరాపై ఎన్నికల అధికారులు నిఘా పెట్టారు. ఎన్నికల అధికారులపై సైతం నిఘా ఉంటోంది. ముఖ్యంగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల తీరును 24 గంటలపాటు డేగ కన్నుతో పర్యవేక్షిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రధాన రహదారుల్లో, చెక్‌పోస్టులవద్ద తనిఖీల్లో ఎన్నికల అధికారులు సైతం ఎలాంటి పొరపొచ్చాలకు పోకుండా ఉండాలనే ఆలోచనతో వారి వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. దీంతోపాటు వాటిని ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తమ మొబైల్ ఫోన్‌లలో చూసుకునేలా జీపీఎస్ ట్యాగ్‌చేసి సీసీ కెమెరాల లైవ్‌ను అందిస్తున్నారు. దీంతో ఓటర్లను ప్రలోభపెట్టే వస్తువులు, డబ్బులు, మద్యం ఇతరత్రా పరిణామాలు ఏం జరిగినా ఉన్నతాధికారులు నీడనై వారి వెంటే ఉంటున్నారు. ఎన్నికల అధికారులను ప్రలోభపెట్టినా, ఎలక్షన్ కమీషన్ తీసుకున్న ఈ చర్యతో ఎవరు తప్పించుకునే అవకాశం లేకుండాపోయింది.

పనితీరు ఇలా..

పెద్దాపురం నియోజకవర్గంలో మొత్తం 9 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు షిఫ్టులుగా పనిచేస్తున్నారు. సామర్లకోట మండలం, పట్టణంలలో రెండు బృందాలు, పెద్దాపురం మండలం, పట్టణంలలో రెండు బృందాలను ఏర్పాటుచేశారు. ఈ బృందాలు 24 గంటలూ పనిచేస్తాయి. ఒక్కొక్క బృందం 8 గంటల పాటు షిఫ్టుగా పనిచేస్తాయి. వీరు తిరిగే వాహనంపై ప్రత్యేకంగా సీసీ కెమెరాను ఏర్పాటుచేశారు. సి-విజిల్ యాప్ ద్వారా ఎన్నికల అధికారులకు వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి నిమిషాల వ్యవధిలో ఆ బృందం అక్కడికి వెళ్లి పరిశీలించే ప్రతీదీ సీసీ కెమెరాల్లో రికార్డుఅవుతుంది. దీనికి తోడుగా అసెంబ్లీ ఎన్నికలలో అభ్యర్థుల ప్రచారతీరును సైతం ఎన్నికల కమీషన్ డేగకన్నుతో గమనిస్తోంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, జన సమీకరణ, గొడవలు, అక్రమ రవాణా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు అధునాతన పీటీజెడ్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇవి 360 డిగ్రీల కోణంలో తిరుగుతూ సుమారు 50 మీటర్ల దూరం వరకూ సన్నివేశాలను, ఆయా పార్టీల ప్రచారాలను రికార్డు చేస్తాయి.



వాహనాలు తనిఖీలు చేసే ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందం

కలెక్టర్, రిటర్నింగ్ కార్యాలయాలకు అనుసంధానం

ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్‌గా ఎంపీడీవో, మున్సిపల్ కమీషనర్ స్థాయిలో పనిచేస్తున్న అధికారులను నియమించారు. ఈ బృందాలు షిఫ్టుల ప్రకారం పనిచేస్తున్నాయి. ఈనెల ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారి వాహనాలకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎక్కడా చిన్నతప్పు జరగకుండా ఎన్నికల కమీషన్ పకడ్బందీగా ఏర్పాటు చేసింది. దీని ద్వారా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారెవరైనా తప్పించుకోలేరు. ఈ కెమెరాలు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు అనుసంధానం చేసి ఉంటాయి.

లారీని ఢీకొని యువకుడి మృతి

● మరొకరికి గాయాలు



పెరవలి, ఏప్రిల్ 12: నిడదవోలు-నరసాపురం రోడ్డులో కానూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో అన్నవరప్పాడుకు చెందిన వసంతాడ మధు (20), నిడదవోలు మండలం కలవచర్లలో దగ్గరి బంధువైన ముప్పిడి నాగచరణ్‌తో కలిసి అన్నవరప్పాడు వస్తుండగా మార్గమధ్యలో కానూరు వద్ద లారీని ఢీకొట్టారు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందగా నాగచరణ్‌కు గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం

కాజులూరు, ఏప్రిల్ 12: విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఉప్పుమిల్లి గ్రామానికి చెందిన యాళ్ళ మధుసునీల్ (19) స్థానిక గ్రామానికి చెందిన ఆక్వా రైతు మారెళ్ళ ఆదినారాయణ చెరువువద్ద జీతానికి పనిచేస్తున్నాడు. అయితే మధుసునీల్ చెరువులో చెత్త కోస్తుండగా ప్రమాదవశాత్తూ కొడవలికి కరెంటు వైరు తగిలి తెగిపోయింది. ఈ క్రమంలో కరెంటు వైరు తగిలి ప్రమాదం సంభవించి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్ఐ తులసీరామ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాలిసెట్ ఫీజు చెల్లించిన సాయిరామ్

మలికిపురం, ఏప్రిల్ 12: బీసీ ఉద్యోగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వేశ్వరాయపురం హైస్కూలులో పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీకి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న 50మంది విద్యార్థులకు పాలిసెట్ ఆన్‌లైన్ ఫీజును సూర్యచంద్ర చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు వాసు సాయిరామ్ అందజేశారు. కార్యక్రమంలో కంకటాల చంద్రశేఖర్, చింతా జయప్రకాష్, చింతామణి, కృష్ణకిశోర్, మల్లేశ్వరరావు, గుబ్బల పుష్పలత, నాగరాజు, మోహన్, మధుసారథి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అండగా ఉంటా: బండారు





కొత్తపేట: బండారు సత్యానందరావును సత్కరిస్తున్న దృశ్యం, ముమ్మిడివరం:సమావేశంలో మాట్లాడుతున్న దాట్ల పృథ్వీరాజ్, ద్రాక్షారామం:యనమదల సమావేశంలో మాట్లాడుతున్న సుభాష్

కొత్తపేట, ఏప్రిల్ 12: వైసీపీ మాయమాటలు నమ్మి మోసపోవద్దని నియోజకవర్గంలో అన్ని వర్గాలతో పాటు దళితులకూ అండగాఉంటానని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం స్థానిక కాపు కల్యాణ మండపంలో నియోజకవర్గ దళిత ఆత్మీయ సమావేశం నిర్వహించారు. దళిత నాయకులు మాట్లాడుతూ మనకి మంచి రోజులు రావాలంటే 'దళితుల పంతం-వైసీపీ అంతం' నినాదంతో రాష్ట్రంలో జగన్‌ని, కొత్తపేటలో జగ్గిరెడ్డిని గద్దెదించేందుకు కంకణం కట్టుకోవాలన్నారు. సమావేశంలో దళిత నాయకులు పల్లి భీమారావు, బూసి జయలక్ష్మీభాస్కరరావు, దండంగి మమత, సాదే లక్ష్మీశ్రీనివాస్, బీర ఇసాక్, చిల్లి ప్రసాదరావు, నక్కా వెంకటేశ్వరరావు, బూసి మరియమ్మ, పల్లి శాంతి పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 12: చంద్రబాబు మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్-6 పథకాలను ప్రజలకు తెలియచేసి వారందరినీ పార్టీవైపు ఆకర్షించేందుకు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని టీడీపీ కార్యాలయంలో దొమ్మేటి రమణకుమార్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన నగర పంచాయతీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలకు నిర్వహించిన సమావేశంలో వక్తలు ములపర్తి బాలకృష్ణ, దాట్ల పృథ్వీరాజ్ మాట్లాడారు. ఈనెల14న కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు 8,9,12,13,14,15 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. వార్డుల్లోని ప్రజలందరినీ ప్రచారంలో పాల్గొనేలా సమాయత్తపరచాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్, అర్ధాని శ్రీనివాసరావు, కడలి సౌజన్య, కడలి నాగు, కట్టా సత్తిబాబు, తాడి నరసింహరావు, అడబాల సతీష్‌కుమార్, విత్తనాల ధనుంజయ, విశ్వ వీరాస్వామినాయుడు, పిల్లి నాగరాజు, దాట్ల బాబు, పితాని నరసింహమూర్తి, రెడ్డి సుధీర్, లోకినీడి వెంకటేశ్వరరావు, గొల్లపల్లి గోపి, కాశి లాజర్, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, పెదపూడి రుక్మిణి, కుడుపూడి మల్లీశ్వరి, చింతపల్లి రాజు, నడింపల్లి కుమార్‌రాజా పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి విస్తృత ప్రచారం

మామిడికుదురు, ఏప్రిల్ 12: మొగలికుదురు, నగరం, పెదపట్నం గ్రామాల్లో పి.గన్నవరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ శుక్రవారం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలువురు ప్రముఖులను కలిసి తనకు సహకరించాలని అభ్యర్థించారు. ఎంపీ ఓటును గంటి హరీష్‌మాధుర్‌కు సైకిల్ గుర్తుపైన, అసెంబ్లీకి తనకు గాజు గ్లాసుపైన ఓటువేసి గెలిపించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్‌తో తిరుగులేని సంక్షేమం

ద్రాక్షారామ, ఏప్రిల్ 12: టీడీపీ రూపొందించిన సూపర్ సిక్స్ పథకాలతో తిరుగులేని సంక్షేమం అమలు జరుగుతుందని టీడీపీ, జనసేన, బీజేపీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం యనమదల, నరసాపురపుపేట గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. వైసీపీ అప్రజాస్వామిక పాలనకు చరమగీతం పాడాలన్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే మీఇంట్లోవ్యక్తిగా అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కట్టా నాగేశ్వరరావు, పారిశ్రామికవేత్తమేడిశెట్టి శేషారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పితాని వీరభద్రరావు, మాజీ ఎంపీటీసి విత్తనాల వెంకటరమణ, మాజీ సర్పంచ్ బడుగంటి చిన్నయ్య, మీనవల్లి దొరబాబు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. అంబికపల్లి అగ్రహారంలో సూపర్‌సిక్స్ కరపత్రాలు అందజేశారు. నరసాపురపుపేటలో పలువురు వైసీపీ కార్యకర్తలు సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

అంతర్వేది, ఏప్రిల్ 12: పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని తెలిపారు. అమలాపురంలో అంతర్వేది పల్లిపాలెం, సఖినేటిపల్లికి చెందిన పలువురు వైసీపీ నాయకులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో చేరారని తెలిపారు. అల్లూరి ప్రసాదరాజు, పోతుమూడి కాసులుబాబు, ఈద మహలక్ష్మి, బి.రవి, వెలిగట్ల మల్లేశ్వరరావు, పల్లిపాలెం సర్పంచ్ ఒడుగు శ్రీను, మాజీ సర్పంచ్ వనమాలి నరసింహస్వామి, తాడి లక్ష్మణస్వామి, నాటిన ఫణిముత్యాలరాజులతో పాటు 30మంది టీడీపీలో చేరినట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంటు కూటమి అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, రుద్రరాజు వెంకట్రామరాజు, మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని, తాడి మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎం చేయాలి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 12: రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎంను చేయాలని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి అయితాబత్తుల ఆనందరావు కోరారు. అమలాపురం పట్టణ పరిధిలోని 12, 13, 14 వార్డుల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీలతో కలిసి శుక్రవారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జిలు వెలిగట్ల రామలక్ష్మణరావు, మహ్మద్ ఖాజాషరీఫ్, మహ్మద్ బషీర్, గెల్లా మీనాకుమారి, వాసంశెట్టి వెంకటరమణారావు, చిక్కాల గణేష్, ఆశెట్టి ఆదిబాబు, భాస్కర్ల రామకృష్ణ, పెచ్చెట్టి విజయలక్ష్మి, దంతులూరి వాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధం పేరుతో లక్ష కోట్లు దోచుకున్నారు

ఆత్రేయపురం, ఏప్రిల్ 12: రాష్ట్రంలో మద్య నిషేధం పేరుతో జగన్ రూ.లక్షల కోట్లు దోచుకున్నారని కొత్తపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి బండారు సత్యానందరావు ఆరోపించారు. శుక్రవారం అంకంపాలెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లిక్కర్ స్కామ్ కంటే పెద్ద స్కామ్ ఆంధ్రలో ఉందన్నారు. జే బ్రాండ్ కల్తీ మద్యంతో అనేక మంది రోగాల పాలయ్యారన్నారు. మద్యం ద్వారా దోచుకున్న డబ్బును ఎన్నికల్లో పంచేందుకు కంటైనర్ల ద్వారా నియోజకవర్గాలకు తరలిస్తున్నారని బండారు ఆరోపించారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు కరుటూరి నరసింహరావు, ముళ్లపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కుదప కృష్ణమూర్తి, ముత్యాబత్తుల రాజు, కప్పల సునీల్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో బండారు

జగన్ పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి చేసి చూపిస్తామని అసెంబ్లీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన అంకంపాలెంలో ఇంటింటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి కరుటూరి నరసింహరావు, గ్రామశాఖ అధ్యక్షుడు కుదప కృష్ణమూర్తి, సర్పంచ్ ముత్యాబత్తుల రాజు, కరుటూరి రవిప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ముమ్మిడివరం, ఏప్రిల్12: ఇంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ టి.గంగాభవానీ తెలిపారు. మొదటి సంవత్సరం 74శాతం, రెండో సంవత్సరం 76.56 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని సీహెచ్ మౌనిక 448మార్కులు, బైపీసీ విద్యార్థిని పి.శ్రావణి జ్యోతి 389మార్కులు, రెండో సంవత్సరం ఎంపీసీ విద్యార్థినులు ఎస్.మాధవి, కె.కృపజాస్మిన్ 855మార్కులు సాధించారు. సీనియర్ బైపీసీలో పి.శ్రావణిసుధ 873మార్కులు సాధించారు. విద్యార్థులను అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులుఅభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో వెనుకంజ

కె.గంగవరం,ఏప్రిల్12: ఇంటర్‌ఫలితాల్లో మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్లస్‌టూ ఉన్నత పాఠశాలల నుంచి పరీక్షలు రాసిన విద్యార్థులు వెనుకబడ్డారు. పామర్రు జూనియర్ కళాశాల నుంచి మొదటి సంవత్సరం 47మంది పరీక్షలు రాయగా ఏడుగురు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం 50మంది పరీక్షలు రాయగా 18మంది ఉత్తీర్ణత సాధించారు. ప్లస్‌టూ పాఠశాలగా మార్చిన దంగేరు ఉన్నత పాఠశాల నుంచి మొదటి రెండో సంవత్సరాల నుంచి 7,8 మంది విద్యార్థుల పరీక్షలు రాయగా ఒక్కొక్క విద్యార్థి ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తంగా ఇంటర్ ఫలితాల ఉత్తీర్ణత నిరాశగా ఉంది.

జూనియర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



రావులపాలెం, ఏప్రిల్12: రావులపాలెం జూనియర్ కళాశాలకు చెందిన ద్వారంపూడి హేమ మాణిక్యాంబ ఇంటర్ ఎంపీసీలో 972మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ కె.గోపాలకృష్ణ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 186మందికి 63మంది, ద్వితీయ సంవత్సరం 161మందికి 102మంది ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ చెప్పారు.

గురుకుల విద్యార్థిని ప్రతిభ



అల్లవరం, ఏప్రిల్ 12: గోడి బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని పెయ్యల నాగశ్రీ అశ్విని ఇంటర్‌లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో గురుకుల కళాశాలల్లో ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ ఎస్.కిరణ్మయి తెలిపారు. ఉప్పలగుప్తం మండలం కామరాజుపేటకు చెందిన అశ్విని ఇంటర్ ఎంపీసీలో 966 మార్కులు సాధించింది. గోడి బాలికల గురుకుల కళాశాలలో 71 మందికి 52మంది ఉత్తీర్ణలయ్యారు. గోడి బాలుర కళాశాలలో 29 మందికి 23మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు.

45 శాతం ఉత్తీర్ణత

రాయవరం, ఏప్రిల్ 12: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు 45శాతం ఉతీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మద్దిరాల రామారావు విలేకరులకు తెలిపారు. రెండో సంవత్సరం 20మందికి 9మంది, ప్రథమ సంవత్సరం 43మందికి 17మంది ఉతీర్ణత సాధించారన్నారు. ఎంపీసీలో పి.కార్తీక్ 451మార్కులు, ఎం.అమృత వర్షిణి 447మార్కులు, సీఈసీలో కె.చండీప్రియ 462 మార్కులు, బైపీసీలో ఎం.నందినీ 355మార్కులు సాధించినట్లు చెప్పారు.

దివ్యాంగులు కోసం సాక్ష్యం యాప్

పి.గన్నవరం, ఏప్రిల్ 12: ఎన్నికల్లో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు పూర్తిస్థాయిలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎన్నికల సంఘం సాక్ష్యం యాప్‌ను రూపొందించిందని కోనసీమ జిల్లా నోడల్ అధికారి బీవీ రమణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై సీనియర్ సిటిజన్‌లు, దివ్యాంగులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాక్షం యాప్‌ను ఓటర్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. 85ఏళ్లు దాటి మంచానికే పరిమితమైన ఓటర్లు, 40శాతం పైబడి ఉన్న ప్రత్యేక అవసరాలు గల ఓటర్లు హోమ్ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌వో ఎం.దుర్గారావుదొర, తహశీల్దార్లు షేక్ హుస్సేన్, ఎం.మేరికమ్మ, విమలకుమారి, ఎంపీడీవోలు సీహెచ్ త్రిశూలపాణి, వేణుగోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోగులమ్మ తీర్థం

అల్లవరం, ఏప్రిల్ 12: గోడిలంక గ్రామదేవత గోగులమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం ఘనంగా జరిగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.

కార్మికులు రోడ్డున పడ్డారు

రాజోలు, ఏప్రిల్ 12: ఇసుకకు కృత్రిమ కొరత సృష్టించి అత్యధిక ధరలకు ఇసుకను అమ్ముతున్న దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వం వల్ల అన్ని విభాగాల కార్మికులు రోడ్డున పడ్డారని టీడీపీ, జనసేన, బీజేపీ రాజోలు నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి దేవవరప్రసాద్ విమర్శించారు. కూనవరం, ములికిపల్లి, చింతలపల్లిలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కలిసి వైసీపీ ప్రభుత్వాన్ని పారద్రోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంల ఎంపీపీ కేతా శ్రీను, గుబ్బల శ్రీనివాస్, చాగంటి స్వామి, దిరిశాల బాలాజీ, సర్పంచ్ బోనం అచ్యుతనాథ్, గుండాబత్తుల తాతాజీ,పినిశెట్టి బుజ్జి, చెల్లింగి జానకిరామయ్య, బందెల పద్మ, చెల్లుబోయిన హెలీన, కుక్కల జేబికుమారి, కాండ్రేగుల మణికంఠ, కౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర రాజగోపురం కలశ పునఃప్రతిష్ట

అంతర్వేది, ఏప్రిల్ 12: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈనెల 13నుంచి 15వరకు ఉత్తర రాజగోపురంపైన కలశల పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 13వ తేదీ సాయంత్రం 5గంటలకు సంకల్పం, విశ్వక్సేన పూజ, అంకురార్పణ, దీక్షాధారణ జరుగుతాయన్నారు. 14నకలశాలకు అభిషేకం, ఆదివాసములు, విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తారన్నారు. 15నఉదయం 8.25గంటలకు కలశాల పునఃప్రతిష్ఠ పూజా కార్యక్రమంలో, 11గంటలకు పూర్ణాహుతితో కార్యక్రమాలు పూర్తవుతాయని ఏసీ సత్యనారాయణ తెలిపారు.

17న శ్రీరామనవమి..

అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సన్నిధిలోని కోదండరామస్వామివారి జయంతి వేడుకలు జరుగుతాయని, 19వ తేదీ ఏకాదశి నుంచి 24వరకు కోదండరామస్వామివారి పంచాహ్నిక కల్యాణోత్సవాలు జరుగుతాయని ఆలయ ఏసీ సత్యనారాయణ తెలిపారు.

బ్యారేజీ వద్ద వాహనాల తనిఖీ

ఆత్రేయపురం, ఏప్రిల్12: ఎన్నికల నేపథ్యంలో బొబ్బర్లంక కాటన్‌బ్యారేజీ వద్దవాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. అంతర్‌జిల్లా చెక్‌పోస్టుగా ఉన్న బొబ్బర్లంక ముఖద్వారం వద్ద ఎస్‌ఎఫ్‌టీ టీమ్‌తో కలిసి తహసీల్దారు ఎం.వెంకటరామయ్య వాహనాలు తనిఖీ చేశారు.

వెంకన్న ఆదాయం రూ.2.19లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 12: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి శుక్రవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,19,307 లభించినట్టు ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.

15 నుంచి చేపల వేట నిషేధం

యానాం, ఏప్రిల్12: ఈనెల15 నుంచి జూన్ 14 వరకు 61రోజులుయానాం ప్రాంతంలోని ఇంజిన్ బోట్లు, ఎఫ్ఆర్‌పీ బోట్లు, ఇంజిన్ నావలు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లవద్దని మత్స్యశాఖ సహాయ సంచాలకులు దడాల గొంతెయ్య ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

శ్రీకామాక్షీదేవి పాలరాతి విగ్రహ ప్రతిష్ఠ



అమలాపురం టౌన్, ఏప్రిల్ 12: శ్రీకామాక్షీ పీఠం మహా సంస్థానంలో శుక్రవారం శ్రీకామాక్షీదేవి పాలరాతి విగ్రహ పునః ప్రాణ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. రాజస్థాన్‌లో తయారు చేయించి తీసుకువచ్చిన పాలరాతి విగ్రహానికి పీఠాధిపతి కామేశమహర్షి యంత్ర స్థాపన చేసి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. ఉత్తరాధికారి విమనస రాజీప్రేమ్ శిఖరానికి యంత్ర స్థాపన చేసి ప్రతిష్ఠ నిర్వహించారు. మహా కుంభాభిషేకం జరిగింది. హైదరాబాద్‌కు చెందిన కోదండపాటి వైద్యనాథన్-నాగమహేశ్వరి, గుండా శ్రీధర్-రాధిక దంపతులు పాలరాతి విగ్రహాన్ని అందించి పూజల్లో పాల్గొన్నారు. గోవిందవర్తుల నాగభాస్కరశర్మ యాజ్ఞికంలో శిష్య బృందం జలాదివాసం, క్షీరాధివాసం నిర్వహించారు. అమ్మవారికి గ్రంధి సతీష్ దంపతులు పాదుకలు సమకూర్చారు. అఖండ అన్నసమారాధన జరిపారు.

ఆస్తి పన్నులు పారదర్శకంగా వసూలు చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 12: పురపాలక సంఘం ఆస్తి పన్నులు పారదర్శకంగా వసూలు చేయాలని టీడీపీ, జనసేన నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. డిమాండు నోటీసులో పన్నులు, వడ్డీ వంటివి స్పష్టంగా పేర్కొనాలని కోరారు. ఆస్తి మూల ధన విలువ ఆధారంగా పన్ను విధించే విధానం అమలుచేస్తున్న ప్రభుత్వం ఏటా 15 శాతం పన్ను పెంచుతుందన్నారు.కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్, జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి

అంబాజీపేట, ఏప్రిల్ 12: గ్రామాలు అభివృద్ధి చెందాయని పి.గన్నవరం వైసీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. కె.పెదపూడిలో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మండల శాఖ అధ్య క్షుడు విత్తనాల శేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



ఆదుర్రులో బిందెలతో తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

మామిడికుదురు, ఏప్రిల్ 12:ఆదుర్రు గ్రామం గరువుకు చెందిన శెట్టిబలిజ, అగ్నికుల క్షత్రియపేటలకు ఐదు రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. గ్రామంలోని వాటరు ట్యాంకుకు నీళ్లు ఎక్కకపోవడం వల్ల తమకు తాగునీటి పంపిణీ జరగడం లేదని వాపోయారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులను అడిగితే వాటరు ఫిల్టరు పనిచేయడం లేదు, మమ్మల్ని ఏమి చేయమంటారని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని వాపోయారు. ఏప్రిల్ నెలలో అవసరమైన తాగునీటిని పంపిణీ చేయకపోతే మే నెలలో ఇంకా చాలా ఇబ్బందులు పడే అవకాశం ఉందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామంలో ప్రారంభించిన కొత్త పైపులైను పనులు మధ్యలోనే నిలిపివేశారని ఆరోపిస్తున్నారు. వెంటనే తమ ప్రాంతానికి అవసరమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండు చేస్తున్నారు.

మాజీ ఎంపీపీకి భార్య వియోగం



మండపేట, ఏప్రిల్ 12: మండపేట మాజీ ఎంపీపీ అడబాల సూర్యనారాయణ(బాబ్జి) సతీమణి రామలక్ష్మి(45) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ద్వారపూడి సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉపసర్పంచ్ తూలా శేషారావు, మాజీ జడ్పీటీసీ పోతుల రాంబాబు, ఎంపీపీ ఉండమట్ల వాసు, ఉండమట్ల రామారావు తదితరులు సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

'ఆరోపణలు నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా'

అమలాపురం రూరల్, ఏప్రిల్ 12: టీడీపీ అధినేత చంద్రబాబుతో తనపై లేనిపోని ఆరోపణలు చేయించారని వాటిని నిరూపిస్తే ఈఎన్నికల్లో పోటీ నుంచి తప్పుకుంటానని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ సవాల్ విసిరారు. భట్నవిల్లిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్ల స్థలాల భూసేకరణలో తాను రైతుల వద్ద నుంచి సొమ్ము తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. సమనసలో వైద్య కళాశాల నిర్మాణం కోసం 64ఎకరాల భూమిని సేకరించి రైతులకు ఎకరాకు రూ.74.50లక్షల చొప్పున చెల్లించేలా అప్పట్లో కలెక్టర్, రైతులకు మధ్యవర్తిగా తానే ఉన్నానని చెప్పారు. తాను అవినీతికి పాల్పడినట్టు రుజువు చేయగల సత్తా టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు బొంతు గోవిందుశెట్టి, జాన గణేష్, పందిరి శ్రీహరి పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలార్జున



అమలాపురం టౌన్, ఏప్రిల్ 12: శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శిగా మాకే బాలార్జునసత్యనారాయణను నియమించారు. ఈమేరకు అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి శుక్రవారం నియామక ఉత్తర్వులందజేశారు.

ఎకరాకు 43 బస్తాల దిగుబడి అంచనా

అమలాపురంరూరల్, ఏప్రిల్12: రెడ్డిపల్లిలో శుక్రవారం నిర్వహించిన పంట కోతప్రయోగాన్ని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు పరిశీలించారు. ఆయనే ఈప్రయోగానికి సూపర్‌వైజర్‌గా వ్యవహరించారు. నిర్దేశిత ప్రదేశంలో 20.06కిలోల దిగుబడి రాగా ఎకరాకు 43బస్తాలు ధాన్యం వస్తుందని అంచనావేశారు. సహాయ సంచాలకుడు ఎంఏషంషీ, డీవైఎస్‌వో ప్రభుదాసు, వ్యవసాయాధికారి కడలి ధర్మప్రసాద్ పాల్గొన్నారు.



వేగిరౌతు రాజబాబుకు టీడీపీ తీర్థం



ముమ్మిడివరం, ఏప్రిల్ 12: వైసీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పదవికి ఇటీవల రాజీనామా చేసిన ముమ్మిడివరానికి చెందిన వేగిరౌతు రాజబాబు గురువారం అమలాపురంలో జరిగిన ప్రజాగళం బహిరంగ సభలో కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన అనుయాయులు కూడా టీడీపీలో చేరారు. గతంలో రాజబాబు టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేశారు.

టీడీపీలోకి రోహిణీకుమార్



అల్లవరం,ఏప్రిల్12:కొమరగిరిపట్నానికి చెందిన గునిశెట్టి రోహిణీ కుమార్, కుప్పాల సత్తిబాబులతో పాటు పలువురు వైసీపీని వీడి అమలాపురంలో టీడీపీలో చేరారు. వీరికి చంద్రబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. గంటి హరీష్‌మాధుర్, అయితాబత్తుల ఆనందరావు, మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఏప్రిల్12: విద్యుత్ లైన్ల నిర్వహణ కోసం కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం10నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. పండిపల్లం, దొంతికుర్రు గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

అంతర్వేది, ఏప్రిల్ 12: మోరిపోడు, సఖినేటిపల్లి శాంతినగర్ తదితర ప్రాంతాల్లో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో ఓటు విలువ తెలుసుకో, భవిష్యత్తును కాపాడుకో, ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధమంటూ ప్రజలను చైతన్య పరిచే విధంగా ప్రత్యేక ర్యాలీలు నిర్వహించారు.

పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 12: గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో కొండలరావు సిబ్బందికి సూచించారు. శుక్రవారం కపిలేశ్వరపురంలో పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి టీటీడీ కల్యాణ మండపం వరకు ఉన్న చెత్త, చెదారాలను తొలగింపచేశారు. కార్యక్రమంలో గ్రామకార్యదర్శి కె.శివ చక్రవర్తి, అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో జె.మల్లికార్జునుడు, పారిశుధ్య కార్మికులు, సచివాలయ, వైద్య ఆర్యోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జవహర్ నవోదయకు నందకుమార్ ఎంపిక



అమలాపురంటౌన్, ఏప్రిల్12: జవహర్ నవోదయ విద్యాలయకు బండారులంక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బళ్ల విజయశ్రీనందకుమార్ ఎంపికైనట్టు ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం తెలిపారు. ఆరో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణుడైన నందకుమార్‌ను ఎంఈవో-2 సరెళ్ల దుర్గాదేవి, హెచ్ఎం ఎస్ఎల్వీ బాల అభినందించారు. బళ్ల సత్యానందరావు, యజ్ఞకుమారి పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: శ్రీరంగనీతులు
వెంకటరమణ	: బడేమియా చోటేమియా
శ్రీలలిత	: లవ్‌గురు
శేఖర్ స్క్రీన్-1	: గీతాంజలి మళ్లీ వచ్చింది
శేఖర్ స్క్రీన్-2	: మంజుమ్మల్ బాయ్స్
రమా	: డీజేటిల్లు స్క్వేర్
గణపతి	: ఓంభీమ్‌బుష్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఫ్యామిలీ స్టార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: గాడ్జిల్లా అండ్‌కాంగ్

నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ అధ్యక్షుడు కనకాల రాజు తదితరులు

యానాం, ఏప్రిల్ 12: పుదుచ్చేరి లోక్‌సభ ఎన్‌డీఏ అభ్యర్థి ఏ.నమశ్శివాయకు మద్దతుగా బీజేపీ యానాం శాఖ అధ్యక్షుడు కనకాల రాజు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. యానాం శివారు మత్స్యకార గ్రామాలు సావిత్రినగర్, గిరియాంపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతు కేంద్రలో, రాష్ట్రంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందన్నారు. పుదుచ్చేరి ఎన్‌డీఏ అభ్యర్థి నమశ్శివాయను యానాం నుంచి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు డీవీవీ సత్యనారాయణ, కనకాల రామదాసు, నరసింహమూర్తి, సబ్బతి లోకేశ్వరరావు, లోకరాజు, కాకి నాగేశ్వరరావు, లక్ష్మీబాయ్ తదితరు నాయకులు, మహిళ మోర్చ, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు. పుదుచ్చేరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వి.వైద్యలింగానికి మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మల్లాడి సత్తిబాబు కనకాలపేట, ఆదిఆంధ్రపేట, ఫిషర్‌మెన్‌పేటల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మలికిపురం, ఏప్రిల్ 12: గూడపల్లిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. రాజోలు అసెంబ్లీ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కటికిరెడ్డి గోపాలకృష్ణ, కొనిదెల శ్రీనివాస్, పున్నం గంగారామ్, సూరిమేను దుర్గాప్రసాద్, దిరిశాల బాలాజీ, గెద్దం మహలక్ష్మిప్రసాద్, చాగంటి స్వామి, గుంటా నాయుడు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాసరి



ముమ్మిడివరం, ఏప్రిల్ 12: ముమ్మిడివరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా దాసరి సత్యనారాయణ ఎన్నికయ్యారు. బార్‌అసోసియేషన్ అధ్యక్ష ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్ష పదవికి ముగ్గురు పోటీపడగా దాసరి 33ఓట్లు సాధించి విజయం సాధించారు. ఎన్నికల అధికారిగా కేఏ శ్రీ ప్రసాద్ వ్యవహరించారు. దాసరి సత్యనారాయణను రిపబ్లికన్ పార్టీ నాయకులు పంతగడ విజయచక్రవర్తి, పలువురు న్యాయవాదులు పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

వైభవంగా మహా అన్నసమారాధన

మామిడికుదురు, ఏప్రిల్ 12: మామిడికుదురు నూకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం నయినాల కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నసమారాధన వైభవంగా జరిగింది. నాలుగు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ఏర్పాటుచేసిన సినీ హీరో డూప్స్ హంగామా కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారిని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి దర్శించుకున్నారు.

బాలుడి మృతదేహం లభ్యం

పి.గన్నవరం, ఏప్రిల్ 12: లంకలగన్నవరం శివారు జొన్నల్లంక ప్రధాన పంట కాల్వలో పంచాలరేవు సమీపంలో గుడాల సాయినాగేంద్ర(11) మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. తండ్రి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజోలు తరలించినట్లు ఏఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 12: మోటారు సైకిల్‌పై వెళుతున్న భార్యాభర్తలను ట్రాక్టరు ఢీకొనడంతో వారు గాయపడ్డారు. ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లికి చెందిన చిన్నం వీరబాబు, అతని భార్య సత్యదుర్గలు మోటారుసైకిల్‌పై కాట్రేనికోన మండలం పల్లంకుర్రు వెళ్లి తిరిగి వస్తుండగా మహిపాలచెరువు సమీపంలో ట్రాక్టరు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన దంపతులను ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌హెచ్‌ఓ జీబీ స్వామి కేసు దర్యాప్తు చేపట్టారు.

అనుమతి లేకుండా ఇటుక పరిశ్రమ





మట్టి నిల్వ

కాట్రేనికోన, ఏప్రిల్ 12: అక్రమంగా మట్టితవ్వేసి ఇటుకలు తయారుచేసి కాసుల పంట పండించుకుంటున్నారు. గ్రామ ప్రజలకు మాత్రం కాలుష్యం అంటగడుతున్నారు. ఇటుక బట్టీలకు అనుమతీ లేదు.. పంచాయతీకి పైసా ఆదాయం లేదు. కుండలేశ్వరంలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీలు నడుస్తున్నాయి. నిరంతరం ఇటుకబట్టీల మంటలు మండుతూనే ఉంటాయి. కాలుష్య పొగ గ్రామమంతా వ్యాపిస్తుంది. అయినా అధికారులు పట్టించుకోరు. కుండలేశ్వరం సమీపంలోని నడవపల్లి పల్లిపాలెం సీఆర్‌జడ్ పరిధిలో చీకటిమాటున మట్టిని తవ్వి ట్రాక్టర్లతో ఈబట్టీలకు తరలిస్తున్నారు. పి.గన్నవరం నుంచి ఇక్కడికి మట్టిని తెచ్చి నిల్వ చేస్తున్నారు. ఊరికి దూరంగా ఉండవలసిన బట్టీలను ప్రజావాసాల మధ్య పెట్టి తమకు అనారోగ్యం అంటగడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని ప్రజలు, ప్రజాసంఘాలు హెచ్చరిస్తున్నారు.